SRI VENKATESVARA ORIENTAL SERIES No. 20.

Editor :— Prof. P. V. Ramanujaswami, M. A.

సుభద్రాకల్యాణము

తాళ్లపాక తిమ్మక్క రచన

శ్రీవేంకటేశ్వరప్రాచ్యపరిశోధనశాలలో ఆంధ్రవాఙ్మయ పరిశోధకుఁడగు

వేటూరి ప్రభాకరశాస్త్రి

పరిష్కరించినది.

తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాక్షరశాల

1950

[వెల రూ. 0—12—0

పీఠిక

ఈ సుభద్రాకల్యాణమును తాళ్ళపాకతిమ్మక్క రచించెను. తాళ్ళపాక అన్నమాచార్యునికి తిమ్మక్క, అక్కలమ్మ యని యిద్దరు భార్యలుండిరి. పెద్దభార్య తిమ్మక్కకు నరసింగన్న యను కుమారుడు చిన్నభార్య అక్కలమ్మకు పెద్దతిరుమలాచార్యుడని కుమారుడు నిద్దఱు కూతుండ్రును కలిగిరి. అందు పెద్దభార్య యగు తిమ్మక్కయే యీగేయకృతికి రచయిత్రి. సంగీత సాహిత్యచతుర యగు నీయిల్లాలి నేలిన యన్నమాచార్యుఁ డదృష్టవంతుడు.

కం॥ సంగీతము సాహిత్యము
శృంగారము చక్కఁదనము శీలము గల పు
ణ్యాంగనకుం బ్రియుడగు కవి
పుంగవుఁ డరయంగ నెంత పుణ్యాత్ముఁడో ! ”

తిమ్మక్క ప్రేయసిగా, భక్తిమయగేయరచన కవితగా, తత్కవితావల్లభుఁడు శ్రీవేంకటేశ్వరస్వామిగా, అన్నమాచార్యునకు లభించిరి. అతఁడు ధన్యుఁడు.

తిమ్మకవికృతి యిది ద్విపదమంజరీవికార మనఁదగిన గేయరచన. శ్రీబాలపామరాదులు కంఠపాఠముగా నేర్వఁదగినది. పాడఁదగినది. పూర్వ మట్లే సాగినది. ఈపాటలోని పలుకుబళ్ళు కొన్నికొన్ని చేమకూర వేంకటకవి విజయవిలాసముఁ జేరినవి. ఈ గ్రంథకర్త అతని కన్నాఁరేండ్లకుఁ బూర్వకాలమున వర్తిల్లినది కాన దీనిలోని పలుకుబళ్ళు చేమకూరకవి యనుకరించె ననవలెను. ఇందులో........మువ్వగోపాల అనికలదుగాని అది మువ్వపురి గోపాలునిఁ బేర్కొనునది యనఁ గాదు. క్షేత్రయ 'మువ్వపురిగోపాలా' యని చెప్పెను గాన యది యట్లే యనవలెను. ఇక్కడ మువ్వలు దాల్చిన బాలగోపాలుఁడని యర్థము కావచ్చును. ఈ పాట నన్నయ భారతకథారచనము నధికముగా ననువర్తించుచున్నది. దీనివ్రాఁత ప్రతిలిపి పాటపాడెడు తీరున తీగెసాగిన దీర్ఘాక్షరములతో నున్నది. శ్రీపామరాదులనోటఁబడి యీ పాట చాల రూపుచెడి శ్రీ కాళహస్తిరాజాగారి యాస్థాని నుండి తెచ్చిన తాళపత్ర గ్రంథసంచయములోఁ గానవచ్చినది. దీని నెంతో దిద్ది కొంత తీరునకుఁ దెచ్చితిమి. ఇట్లు దిద్దుటలో అచ్చు చిత్తులు చూచుటలో చిరంజీవి పంగనామముల బాల కృష్ణమూర్తి, విద్వాన్, శిరోమణి, బి.ఓ.యల్. (ఆనర్సు) నా సహోద్యోగి చాలఁ దోడ్పడెను. యథా మాతృక

ముగా చిరంజీవి విద్వాన్ పి. పార్థసారథినాయుడు పరిశోధన శాలా విద్యార్థి వ్రాసెను.

అన్నమాచార్యోత్సవము నాటి కాయన యిల్లాలి గేయరచనమును దీనిని వెల్వరింపవలయునని వడివడిగా దోష సహస్రము దిద్దుమ నన్నుం కిచ్చుచుండగా ప్రెస్సు మేనేజరు శ్రీ T. R నరసింహంగారు, కంపోజిటర్లు శ్రుతికలిపి వడిగా వారములో ముద్రణము ముగించిరి. ఈ ద్వితీయ వర్షాన్నమాచార్యోత్సవమున (విరోధి ఫాల్గున బహుళదశమి) వెల్వడిన యీ గ్రంథము, సర్వసమ్మతముగా శ్రీ సి. అన్నారావుగారు కమీషనరుగాను, శ్రీ సి. రామస్వామిరెడ్డిగారు పేష్కారుగాను, శ్రీ తిరుపతి దేవస్థానమున నుద్యోగించుటకును, భారతదేశము సంపూర్ణస్వాతంత్ర్యము పడయుటకును, జ్ఞాపకముగా వెలయఁగలదు.

తిరుపతి
13-3-50

వే. ప్రభాకరశాస్త్రి.

సుభద్రా కల్యాణము

తాళ్లపాక — తిమ్మక్క — రచన

శ్రీరమావల్లభులు - శ్రీకృష్ణు తెలవి
ద్వారకాపట్టణము - తమ రేలుచుండ
శ్రీకాంతపతికృపను - జెలగి పాండవులు
ప్రాకటంబుగను ద్రౌ - పదిని బెండ్లాడి
రంత నింద్రప్రస్థ - మను పట్టణమున
సంతసంబున నున్న - సమయంబునందు
సురముని యేతెంచె - సుదతి పూజించె
అరలేక మ్రొక్కగా - నపుడు ద్రౌపదిని
దీవించి లోపలికి - దిరిగి పొమ్మనియె
నేవురితోఁబలికె - నిట్లు నారదుడు
ఇంతుల కథలైన - నెంతవారికిని
చింతింప మదిలోన - చీకాకు గదురు
సుదతికై సుందోప - సుందుల చరిత
విదితముగ జెప్పెదను - వినుడంచు బలికె
సుందరికొఱకునై - సూడు పుట్టంగ
సుందోపసుందులు - ద్రుంది మున్నెగిరి

కావున మీర లో - క్కటిఁ గాంత పొందు
గావింపరాదు సం - కటపాటు గదురు
ఒక్కొక్కయే డామె - యొక్కొకరినగర
మక్కువతో నుక్కి - మర్యాద యగును
ఒక్కరి నగరిలో - నువిద యున్నపుడు
మక్కువ వేఱొకరు - మసల రాదచట,
ఏకాంత మరయక - యేగినవారు
వ్యాకులపడక యా - వసతి వర్జించి
తిరముగా నొకయేఁడు - తీర్థాళులందు
చరియించ వలె నని - సమయంబు చెప్పి
ఒప్పించె నారదుం - డొగి నేగె నంత
అప్పటినుండి - తా రైదుగు రర్మి
సమయంబు పాటించి - సాధ్వితో గలసి
ప్రమదంబుతో భూమి - పాలించు చుండ్రి
ఒక్కనాడాపురిని - నొక విప్రునింట
తెక్కలి మ్రుచ్చులు - ధేనువుల్ గొనుచు
చనిరి విప్రుం డంత - సవ్యసాచికిని
మొఱసి ధేనువులకై - మొఱవెట్ట దొణగె
భూసురవర్యుండు - మొఱలిడ దెలిసి
భాసురంబుగ తన - ప్రతినను తలచి
ఆయార్తరవముల - కా ధనంజయుఁడు

ఆయుధశాలకు - నరుగంగవలసి
ధర్మనందనుఁడు తా - ద్రౌపది గూడి
కూర్మితోనుండుట - గూడ గుర్తించి
ఆభూమిదేవు నుడు - లడలు ధేనువుల
క్షోభలు మాన్పంగ - జూచి ధర్మువును
అనుచు నాయుధశాల - కరుదెంచి క్రీడి
తనువున నాయుధాల్ - తగదాల్చి పట్టి
తఱిమి యామ్రుచ్చుల - దండించి పసుల
మఱల నాద్విజునకు - మరియాద నొసగి
తనయన్న కడ కేగి - దండంబు వెట్టి
మును జేయునమయము - మునుకొని చెప్పి
వెలమితో దీర్థముల - కేగెద ననగ
బలికె ధర్మజు డంత - బార్థుని తోను
నిను విడిచి యొక ఘడియ - నేనుండ లేను
నను విడచి యేరీతి - చనెదవోయన్న
కొమరొప్ప వచ్చితివి - గోవులకొఱకు
సమయభంగములేదు - చనవల దనెను
మనము గావించిన - మర్యాద లన్ని
మనమె చేయకయున్న - మఱి ధర్మమేది ?
అనుచు ధర్మజుచేత - ననిపించుకొనియె
యన్న పాదములకు - నతిభక్తి మ్రొక్కి

వాయునందనునకు - వందనం బొసగి
కవలు మ్రొక్కినవారి - కౌగిట జేర్చి
ఆయతిథిచేతను - అనిపించుకొనియు
చనియె తీర్థములకు - శక్రనందనుఁడు
గరిమ పెద్దలు పుణ్య - కథలు జెప్పుచును
ధర ప్రదక్షిణము స - దా చరింపుచును
అక్కడక్కడగల - యఖిల తీర్థములు
వేడుక నాడుచు - విజయుండు కనియె
అంగవంగకళింగ - బంగాళములను
పార్థుండు గడిచెను - బహుదేశములను
గంగ స్నానము జేసి - కడు నీమమునను
సంగతిగ నొకనాడు - జపతపంబులను
గావింప నొక నాగ - కన్య యేతెంచి
కనుమాయ గావించి - యనురక్తి మించి
ఘనగతి నాగలో - కమునకు జనెను
మానంబు మాని యా - మగువ కిట్లనెను
మానిని వినవె జి - హ్మగలోకమునకు
నేనేల వచ్చితి - నీకు పేరేమి
పూని తెల్పు మని యా - పొలతిని సడుగ
నై రావతుండు జా - హ్నవికి వల్లభుడు
కౌరవ్య డనువాడు - కలడు తక్షకుడు

నా పేరును పులూచి - నను గనిరి వారు
నీ పౌరుషమ్ములు - నీ రూపుమహిమ
పనిగొని గీతరూ - పమున వెల్లడిగ
విని నిన్ను గామించి - వేడ్క దెచ్చితిని
నా కోర్కె లీడేర్చు - నాకేశతనయ
కైకొను మనడు నా - కాంత నీక్షించి
నారద సద్బ్రహ్మ - చారి యానతిని
నిగిడి యీ ధరమీఁది - నిఖిల తీర్థములు
వరగ చరించగ - సమయమ్ము గలిగె
వరగ ధర్మజునితో - పలికి వచ్చితిని
నీ మనోభీష్టంబు - నే నెట్లు దీర్తు
భామిని ! యనిన నా - పద్మాక్షి పలికె
ధర్మమేదియు ప్రాణ - దానము తోను
తుల దూగదని మహా - త్ములు పలుకుదురు
చేకొని తన్ను ర - క్షించిన మీకు
పాకశాసని ! వ్రత - భంగ మెక్కడిది
పరగ ధర్మ స్థితి - పాంచాలికడను
పరగ మీ చేసిన - నమయమ్ము కాద
అనగ ధర్మ స్థితి - కాత్మ మోదించి
అచట పుత్రుని గాంచి - అనాతి కొసగి
మనమున సుప్వాంగి . మఱునాడు వెడలె

కమలాక్షు డుదయించు - కాలంబునందు
క్రమమున క్రీడి గం - గానది జేరె
తనవెంట వచ్చిన - ధాత్రీసురుల
గనుగొని యర్చించి - కథలెల్ల జెప్పె
అర్థముల్ ధేను స - హస్రముల్ గాను
అర్థితో భూసురుల - కమరకంబొసగె
అనిపికొని కొందరి - నందు గొందఱిని
నొనరగా చేకొని - యుదధి తీరమున
ఉర్వీధరుని పురు - షోత్తము గాంచి
పమ్మిన భక్తితో - ప్రణతు లొనర్చె
ఓ విశ్వపాలక - ఓ విశ్వకర్త
యో విశ్వరక్షక - యో జగన్నాథ
నీ యందు గల్గు నీ - నిఖిలలోకములు
మాయెడ కృప యుంచి - మమ్ము రక్షించి
పాయక నాకోర్కె - ఫలియింపజేయు
మనుచు సన్నుతి జేసి - యతనికి మ్రొక్కి
చనుతెంచె పర్వత - స్వామిసన్నిధికి
అమర నహోబళం - బా వెంకటాద్రి
పరుస నాపై కంచి - వరదుల గొలిచె
క్రమమున కావేటి - రంగనాయకుల
క్షేమను దర్శించి - పిదప తానంత

అల దక్షిణమ్మున - వెలసిన యట్టి
లలిత నదుల తీర్థ - ములనాడె క్రీడి
మునుకొని యటు పద - మూడవ నెలను
పనిబూని మణిపురి - పట్టణమ్మునకు
అరిగె నప్పుర మేలు - నవనీశ్వరుడు
బలవిక్రముడు చిత్ర - వాహనుం డపుడు
ఎదురేగి తోడ్తెచ్చి - హేమపీఠమున
వదలని భక్తితో - వాసవి నునిచి
అడుగుల నర్ఘ్యపా - ద్యముల బూజించె
సురపతి సుతుండు వ - చ్చుట వైపు దెలిసి
కౌంతేయు డిష్ట మా - ర్గమున జిక్కునని
యంతంత మది నుబ్బి - యర్జును జూచి
యేను నీ కొకమాట - నెఱిగి చవలెను
మానవాధీశ్వర - మావంశ మందు
ఘన విక్రముడు ప్రభా - కరుడను రాజు
తనయుల కొఱకు దా - దడయకెంతెంతో
తపసుజేసిన చంద్ర - ధరుడును మెచ్చి
అపుడు దానొకమాట - నరుదుగ బలికె
వసుధేశవరుడ నీ - వంశ వీరులకు
పొసగంగ నొక్కొక్క - పుత్రుండు పుట్టు
అని యిచ్చె వరమీశు - డతని వరమున

గొనకొని యొక్కొక్క - కొమరుండు పుట్టె
ఘనుడ నా కిప్పుడీ - కన్యక పుట్టె
తనయుల కొఱకుగా - తనయ నే బ్రోతు
ఈలతాంగికి నుద - యించు నాసుతుడు
నాలాయముగను మా - వంశమ్ము నిలుపు
వరపూజ తో పెంచి - వరునకీ కొమిరె
పరగ నిచ్చుట నాదు - భాగ్యమే కాదె
యొసగ భూపతివి నీ - విందువంశ్యుడవు
పొనగ పెండ్లాడు నా - పుత్రిక ననిన
కవ్వడి దానికి - కడు సంతసిల్లి
నివ్వటిల్లెడి కోర్కె - నెలత బెండ్లాడె
అంగజు దేవి జి - త్రాంగద గూడి
పొంగుచు నంతనా - పురము చెంగటను
అయ్యర్జునుండు వసు - ధామరుల గూడి
చయ్యన జనుదేర - జలధి తీరముకు
స్నానము చేయగ - నమ కట్టియున్న
పూని యక్కడి ముని - పుంగవుల్ విజయు
గనిరి యీకొలనును - హోదుర్గమమ్ము
ఘనతరగ్రా హానం - కలితమ్ము నగుచు
పార్థుండ యిచోట - భరితమ్మునైన
తీర్థరాజమ్ములు - దీపించు నైదు

వలలితముగను బ్ర - సన్న తీర్థమ్ము
ఫలదమైనట్టిసౌ - భద్ర తీర్థమ్ము
శోభింపగాను శౌ - లోమతీర్థమ్ము
పావనంబౌ భర - ద్వాజతీర్థమ్ము
కారుణ్యమయుడ యీ - కారంధమంబు
ధారుణిలో ప్రసి - ద్ధమ్మయి యొప్పు
బలభేది సుత ! యెట్టి - బల్లిదు లైన
చెలగి యీ కొలకులు - చేర నోడుదురు
అని చెప్పగా దాను - వినియు నర్జునుడు
వచ్చి యీఘనసరో - వరములో జొచ్చి
యిచ్చమై తీర్థమ్ము - లే నాడవలెను
అనుచు నయ్యర్జునుం - డతిసాహసమున
ఆయెడ సౌభద్ర - మనియెడి కొలను
వరగ ప్రవేశించె - జలమధ్యమునకు
కడు నుగ్రగతి మహో - గ్రాహ మేతెంచి
తను డాయ దాని ను - ద్దండత బట్టి
బహు పరాక్రమశాలి - బైట పడవేసె
నక్రరూపము మాని - నాతియై నిలిచె
శక్ర నందనుడు నా - శ్చర్యపడి చూచె
ఇదియేమె భామ నీ - వింతకు ముందు
వదలక యీసరో - వరములో నుంటి

జలచరాకృతి మాని - జలజాక్షి వైతి
వలనుగా నెఱిగించ - వలెను తత్ క్షణమే
మత్తాక్షి నీవు ముక్త - మకరివై యుండి
యిచట భామిని యవుట - కిరవేది చెపుమ
అనఘుడ నే వంద - యానెడి యచ్చరను
ధనదునకును గూర్చు - దాన నాసఖులు
సౌరభేయి సమీచి - జయలతల్ వారు
నలుగురు తనయట్టే - నక్ర రూపమున
జలధిలో నున్నారు - శాప విముక్తి
ననువొంద గావించు - మనిన నర్జునుడు
ఏమి కార్యమ్మున - నిట్టె చందమున
భామిని యిది మీకు - పాటిల్లె ననిన
ఇంద్రనందన మాను - జేంద్ర యేపురము
యింద్రాదిలోకము - లెల్ల కన్గొనుచు
ధరణిపై ఘన తపో - ధను లున్న వనము
గనుగొని యందగ్ని - కల్పుడౌనొక్క
బ్రాహ్మణుని తపస్సు - భంగమ్ము చేయ
తలచిన నలిగి యా - తాపసోత్తముడు
చలము మీఱగరాని - శాపము బెట్టె
భయమున నాముని - ప్రార్థన చేయ
దయజూచి యాతపో - ధను డిట్టు పలికె

సాహసుం డెవ్వఁడీ - సరసిలోఁ జొచ్చి
బాహువల మిము బట్టి - బయట వేయంగ
నోపునో మీశాప - ముడుగు నాక్షణమె
పోపొండి మీరుమీ - భూమికి ననుచు
చనుదేర నారద - సంయమి వచ్చి
సతులాల యీముని - శాప వాక్యమ్ము
మిక్కిలి క్రూరమే - మిట మాన్పరాదు
తెరలుడు మీకింక - దక్షిణాంభోధి
తటమున పంచతీ - ర్థములు శోభిల్లు
అటుచని నూరేండ్లు - లందుండు డనెను
ఒకనాడు ఫల్గునుం - డు ర్వీప్రై కరిగి
సకల తీర్థముల ద - ర్శనకాంక్ష వచ్చి
స్నానము జేయ మీ - శాపము దీరు
అనిచెప్పి నారదుం - డరిగె తనంత
మీరాక గోరగా - మీరు వేంచేయ
నరయగ ధన్యుల - మైతిమి మేము
నరు డవ్వు డారీతి - నలుగుర సతుల
కరుణించి శాపము - కడతేర్చె నంత
మగువల వీడ్కొని - మణిపురి పురికి
మగుడ నేతెంచి నె - మ్మదిని కొన్నాళ్లు
అంగన యుండెఁ జి - త్రాంగద యింట

అనఘుఁడు బభ్రువా - హానుడను సుతుని
వరచిత్రఘను చిత్ర - వాహానువంశ
కరునిగా నొసఁగి యా - కాంత దిగ విడచి
స్థిరముగా గోకర్ణ - దేవు దర్శించి
అరిగె నవ్వలిపార్శ్వ - మంబుధిచెంత
పావనంబైన ప్ర - భాసతీర్థమున
భావజాకారుడు - పార్థు డుండగను
చేరువ నంత నా - శ్రీకృష్ణు డుండు
ద్వారకాపురియని - తగు మునుల్ పలుక
నీలమేఘశ్యాము - నిఖిలాభిరాము
లాలితశుభగాత్రు - లక్ష్మీకళత్రు
ఆకంజదళనేత్రు - నలరి సేవింప
నాకోర్కె లెల్లగ - న్నన నమకూడు
గదునిచే మును వింటి - కన్య సుభద్ర
మదిరాక్షి సుకుమారి - మత్తేభగమన
గుణవతి యనఁగ మ - క్కువ చూడ వలెను
తుణమైన నా కొమ్మ - కనుగొనవలెను
అనుచు ధనంజయు - డా ద్వారవతికి
చన నున్నతలపున - సకలయాదవులు
యతుల బూజింతు రట - మతిగల్గి కపట
యతివేషధారినై - యలరి యర్జునుడు

భక్తిము క్తిప్రియు - పుండరీకాక్షు
భక్తవత్సలు కృపు - పరమాత్మ కృష్ణు
తత్తరపడక చి - త్తమ్ములో నునిచె
అత్తతి శౌరి స - ర్వాత్మకు డగుట
అంతనా నరునితల - పంతయు దెలిసి
యొక్కరుం డేతెంచె - కౌనరి వచ్చుటకి
నరుడు వచ్చెరు వంది - నారాయణునకు
నరగున ప్రణమిల్లి - సద్భక్తి మ్రొక్కి
వనమాలి కెదురుగా - వచ్చి యర్జునుడు
దండప్రణామమ్ము - తగ నాచరించె
నారాయణా యనుచు - నవ్వుచు నరుడు
కరము బట్టుక వాని - కడు తేవ నెత్తె
హరియు నవ్వుచుం బల్కె - నర్జును జూచి
నిన్న నే సుతుల గని - నెఱతినమ్మనను
యింతలో సన్యాసి - నెట్లయితి వయ్య
మెరుగుదుము మావిద్య - లెల్లను మేము
గరిమ వేసా లల్ల - గ్రాసాలకొఱకె
అని గేలి సేయుచు - నతని దోకొనుచు
చనుదెంచె రైవత - శైలమ్ము కడకు
అచట నర్జును నుంచి - హరియు నంతటను
నడనడచి ద్వారకా - నగరి కేతెంచి

కొలువులో యాదవ - కోట్లను గొలువ
బలదేవుతోడను - పద్మాక్షు డనెను
తాలాంక ! సకలయా - దవులతో గూడ
వాలాయముగను రై - వతమహోత్సవము
జరుపంగవలె ననిన - శౌరి కాక్షణమె
సమరసమ్మున పురి - సాటించు మనిరి
సకలపౌరులు నొప్ప - సాటించి రెలమి
పప్పు బూరెలు నెయ్యి - పాయసాన్నములు
కాయగూరలు పెక్కు - కలవంటకాలు
ఊరుగాయలు నెయ్యి - వొబ్బట్లు వడలు
గారెలు బూరెలు - కండమండిగెలు
అరటిపండులును రా - జాన్నరాసులును
పిండికూరలు మొదల్ - పెద్దకుడుములును
గరిగలఘటముల - గంపల నునిచి
ముందఱ నడిపించె - మురజవాదములు
సంతోషఘోషముల్ - సంకులమ్ముగను
పడుచులు పెద్దలు - బాలింతరాండ్లు
కొడుకులు కోడండ్లు - కూతు లల్లుండ్లు
తోతొక్కులాడుచు - ద్రోవ కిక్కిరిసి
చనిరి యాదవు లంత - సంభ్రమమునను
అంతంత చతురంత - యానంబు లెక్కి

అంతఃపురస్త్రీలు - నంత నేతేర
నుద్ధవసాత్యకు - లుభయపార్శ్వముల
బద్ధానురాగుళ్తై - బలసి తక్ గొలువ
అప్పుడు శ్రీకృష్ణు - డన్నయు దాను
క్రొత్తముత్యమ్ముల - గొడుగుల నీడ
సురలెల్ల చనుదెంచి - చూడగా నప్పుడు
గరుడధ్వజాంకిత - ఘనరథం బెక్కి
ఆయచలమ్మున - యాదవుల్ గొలువ
తడయ కప్పుడు రైవ - తకమున విడిచె
ఆయచలమునకు - యాదవుల్ వచ్చి
ఆయతభక్తితో - నర్చించి మ్రొక్కి
అపుడు సుభద్రయు - నాతణమ్మునను
పణతియ బంగారు - పల్లకి నెక్కి
చామ రుక్మిణిసత్య - భామ రేవతియు
దేవకి వసుదేవ - దేవు లంతరును
వారివారికి తగు - వాహనా లెక్కి
వచ్చిరి రైవత - పర్వతమునకు
కొమ్మలు పదివేలు - కొలుచుచు రాగ
సమ్మతిగ నేతెంచి - సంభ్రమమ్మునను
వాసవిసుతుండు తన - వరుడు కావలసి
ఆయచలమునకు - నాయింతి మ్రొక్కె

ఆసమయమ్మున - నర్జునుఁడు తనదు
మదిలోన తలపోసె - మగువరూపమ్ము
దండ లావణ్యమెం - తయు రూపుతోను
వుండునో యనుచు ని - ట్లూగి కొంతసేపు
యింతిమోముకు చంద్రు - డీడైన నేమి
కుంతలాలాకలిమి - కొదమతుమ్మెదలు
బాలకనుబొమ్మలకు - ప్రతియౌనువిల్లు
పాలించు ముత్యముల - పణతిచిర్నగవు
సతినాస తిలపుష్ప - సమమైన కేమి
అతివ మ - ధ్యమ్ము సింహాయునకు సరియౌ
అసు పోల్పతగు సుంద - రాంగియవ్వనము
కనుగొని పెక్కండ్రు - కాంతలు గొల్వ
కవ్వడి గనుగొని - కమలాక్షు డనియె
కనుచూపి నంతలో - కాంక్షింప తగున
మొదల సుభద్రపై - మోహంబు నీకు
వదలక యుండుట - వడి యెఱుంగుదుము
తలపు నీ కీడేరు - తలకకు మనుచు
జలజాక్షు డావేళ - చెలిని రప్పించి
వందనము జేయించె - వరమునీంద్రునకు
పాండవద్విజులకు - పార్థు డివ్వేళ
దండియై యుండుట - తెగ నెఱింగించ

వడిగ నేగులవారి - వలన పంపించె
బలదేవు జూచి యా - పద్మాక్షు డనెను
ఎక్కడనుండి యో - యీ పర్వతముకు
నరయ మెచ్చ్వరో కాని - యతి వచ్చినాడు
పోనగ చాతుర్మాస్య - పూజ చేయుదము
అని పెడబొబ్బగా - అన్నతో బలికి
నడనడచి ద్వారకా - నగరి కేతెంచె
అప్పుడు బలభద్రు - డాముని జూచి
భక్తితో నిట్లని - ప్రార్థన చేసె
పోనగ చాతుర్మాస్య - పుణ్యవ్రతంబు
జరుపు మా నగరాన - సంయమినాథ
అని తోడుకొనివచ్చి - రాద్వారకకును
రావె యమ్మ సుభద్ర - రమణిరో నీవు
మదిరాయతాక్షి నా - మనవి చేకొనవె
కన్యచే భిక్షయె - కాని యీ తండు
అన్యులచే భిక్ష - నంద నొల్లండు
కన్యాగృహంబున - కన్య కామణివి
సన్న్యాసి నునిచి పూ - జావిధి చేయు
మనుచు చెల్లెలికి స - న్న్యాసి నొప్పించి
ఆపద్మనాభుండు - అపు డూరకుండె
ముత్తెలసంచునా - ముత్తె బిండెలను

అత్తరి జలక మా - యత్తమ్మ జేసె
యేవేళ కా వాని - యిష్టమ్ము లెఱిగి
ఆవేళ కావించు - నఖిల వస్తువులు
పాలుపైన రత్నాల - బొమ్మరింటికిని
తళుకైన పగడాల - దారబందములు
పచ్చల కలుఁపులు - పన్నారు గురుగు
లచ్చంపు దంతాన - నమరు బొమ్మలును
చెఱగుల యంచుల - జీనివ్రాతలును
చిరుతపప్పళ్లు మఱి - చెంద్రకావులును
బంగారు బొమ్మలకు - బాగుగా కట్టి
శృంగార మమరించె - చెలియ సుభద్ర
బలసి సుభద్ర శో - భనము చేయగను
అరుదెంచి కవ్వడి - అతివ కిట్లనెను
ఇందు పురోహితుం - డెవ్వరె నీకు
అందమైనట్టి ఘడి - యారమ్మ నేడె
అన్నియు నేల నీ - యాశ్రితుడ నేనె
యున్నాను నీపెండ్లి - నొనర జేయించ
పప్పు బూరెలు మంచి - పాయసాన్నములు
వొప్పైన భిక్ష మా - కొనరఁగా గద్ద
వన్నారు గురుగుల - పంచభక్ష్యములు
నెన్నిక భుజియించె - నెలమితో నగుచు

తెరయొద్ద నిలుచుండి - దేవేంద్రసుతుడు
సరసిజవదనతో - సరసమ్ము లాడు
భావగర్భితముగా - పలుకు మర్మములు
భావించి నతిజూచి - పరగ తమకించు
చెలియ లక్షణములు - చెప్పెద ననుచు
కలికి నొయ్యన లేవ - కరము చేబట్టి
అక్షీణజృంభణం - బది యెంట గద్దు
అక్షయ సౌభాగ్య - మది యింట గద్దు
పద్మరేఖలు నీవు - భాసిల్లు ననుచు
పద్మాక్షి పాదముల్ - భావించి చూచె
వియ్యమ్ము లందగా - వెలదిరో గుఱుతు
ముడి వడె హారముల్ - ముద్దుల గుమ్మ
చిక్కు విడిపింతు నే - చేడె సుభద్ర
మక్కువ నామీద - మఱవకు మనెను
వేదోక్త యుక్తిని - వింత పెండ్లింత్లు
కావించవలె నంద్రు - ఘనశాసనమున
నాలవ దినమున - నాగ వల్లికిని
శోభనం బగు గదే - సుదతి యిద్దఱకు
పానుపుటింటికి - పరగ బొమ్మలను
కడువేగ నంపుదము - కమలాయతాక్షి
అనుచు కందువ మాట - యతి తను బలుక

కీర్వారపడి యుండె - నెలత సుభద్ర
మతి యెన్నొరీతుల - మాయల తపసి
నెఱవక తనుజూడ - వెఱగొందె నబల
గ్రక్కున శ్రీకృష్ణు - కడకు నేతెంచి
యొక్కడి యతివరుం - డితడు వోయన్న
చూడ సంయమి గాని - చూఱకాం డితడు
ఆడెడి మాటలి - ప్పని పల్కరాదు
సడిపమాడగ వచ్చు - సారె నాతోను
సొంపు నొయ్యారంపు - చూపుచే తలచు
ఇత్తఱినే భిక్ష - మిడి సంత దాను
గొత్తున భుజియింప - పోలతి రమ్మనెను
ఎంత జేసితిరి మీ - రిటువంటి పారి
సంతఃపురమ్ములో - నర్హమా యుంచ
అన్న యీ సన్యాసి - ననుపుమా నేగ
ఎన్నికబూజింప - నే దగవు గాదు
తన్ను జూడగ నిల్వ - తగవుగా దితడు
కటకట యిటువంటి - కపట సన్యాసి
నెటువలె బూజింతు - నిందిరారమణ
అనిన నవ్వుచు గృష్ణు - డా యతీశ్వరుని
వినయమ్ముతో బిల్చి - వేడ్క నిట్లనెను
అయ్యా మీపను లన్ని - ఆగడా లాయె

తొయ్యలి నాతోన - దూఱుగా జెప్పె
పెద్దలు మీరింత - బుద్ధి దప్పినను
సుద్దుల నందఱు - చులుకగా నగరె
కాక నాచెల్లెలు - కడు ముద్దరాలు
లీలగా దుర్భావ - లేల పలికితిరి
కోరినకోర్కె చే - కూరినదాక
పరికెనే నూర - కే యుండరాద ?
ఇచ్చట చెప్పిన - యింతి సుభద్ర
వచ్చట రాముతో - నలిగి చెప్పినను
యీ ద్వారకాపురి - యిం దుండబోదు
నవనిపై చరియించు - మని నిన్నుగొట్టు
నని గేలి సేయుచు - నతని వీడ్కొనుచు
ప్రియముతో చనుదెంచె - పిదప తా నంత
నవరత్న కనకసిం - హాసనమ్మునను
పేర్మితో గూర్చుండి - పీతాంబరుండు
శిరసు వంచుక యున్న - చెల్లెలి జూచి
దయతోడ బిలిచె నా - త్రైలోక్య పతియు
అమ్మరా ముద్దుల - గుమ్మ రా వేగ
కొమ్మ రా నవకంపు - బొమ్మ రావమ్మ
ముత్యాలసరమ రా - ముద్దరాలా రా
చిత్తజుబాణమా - చెలియ రావమ్మ

సుభద్రాకల్యాణము

చిలుకలకొలికి రా - శృంగార కన్య
తొలకరి మెఱుప రా - తోయజగంధి
పండువెన్నెల రావె - భాగీర్తి రావె
కందుగోవెల రావె - కమలాక్షి రావె
మచ్చెకంటీ రావె - మాధవళి రావె
అమృతంపుతెప్ప రా - అరవిరిమొగ్గ
బంగారుపెట్టెరా - భాగ్యాలబరణి
నెలయు ముజ్జగముల - వింత ప్రైమె నట్టి
శ్రీకలా ఖిరుముల - చెలియు రావమ్మ
కోరు కార్యమ్ము చే - కూరినందాక
అని యిట్లు తమ అన్న - అంకించి పిలువ
పసిడి సలాక నా - పణతి సుభద్ర
పాలి పువ్వుగుత్తుల - తలిరాకు బోణి
లలిత సౌరభ శోభ - గులుకరింపంగ
పసిచక్కగా పైట - సవరించు కొనుచు
నడనడ చిన్నారి - నడుము జవ్వాడ
అందెలు మ్రోయగ - హారముల్ తూగ
మొలనూళ్ళ ఘంటలు - ముద్దియల్ మ్రోయ -
పందిదండలు వెగ్గ - సరిపెణల్ దూల
దివ్యలై హారముల్ - తెరువు జూపగను
పొంపలునడకతో - నతివ సుభద్ర

అల్ల నల్లనె వచ్చె - అన్నముందరికి
భద్రేభగమన సు - భద్ర రమ్మనుచు
తోయజాక్షుడు తన - తొడపైన నునిచె
నీలాలవంటివా - నెలత నెఱికురులు
వాలారు కొన గోళ్ల - వడిచిక్కు దీసె
శ్రీకృష్ణు డావేళ - చెల్లెలి కపుడు
నేనకొప్పటు బెట్టి - చెలువమ్మ తోను
చుబుకంబు పైకెత్తి - చూచి యోదార్చి
మక్కువ నలరించె - మగువ నెమ్మోము
కుంచించుకొని శిరసు - వంచుకొని బోవ
శిరసు తాబైకెత్తి - చెల్లెలిని చూచి
చిఱునవ్వుతో బలికె - శ్రీకృష్ణు డెలమి
ఏమే మనె సన్యాసి - యిపుడు నిన్నైన
నాతోను జెప్పిన - నాతి నే బోయి
మందలించెద నమ్మ - మరియాదగాను
ముద్దరా లోర్చునా - మొప్పెమాటలకు
అని మట్టుపెట్టి యిపు - డాడి వచ్చితిని
రమణి నీ జోలికి - రా వెఱచు నింక
వచ్చిన యప్పుడె - వనిత నేబోయి
యిట్టె బంధించెద - నిపుడె కొట్టెదను
అని బుజ్జగించి చె - ల్లెను గారవించి

చెలునమ్మఁగా బలికె - శ్రీకృష్ణు డెలమి
మత్తేభగమన నా - మనసు చేకొనవె
మదిరాక్షి నీకొక్క - మాట జెప్పెదను
తగ నేడు నేడు ప - ద్నాల్గు లోకములు
పరసి చూచితి నేను - ఆదికాలమున
ఇటువంటి సన్యాసి - నెట జూడలేదు
అటుగనుక నీ తోడ - నిటు జెప్పవలసె
శిరసు నాఘ్రాణించి - చెల్లెలి నపుడు
కనుగొని పలికె నా - కంజాక్షు డెలమి
యేమని వర్ణింతు - నితని మాహాత్మ్య
మేమని వర్ణింతు - నితని పౌరుషము
ప్రమథగణముతోను - పార్వతీశ్వరుడు
నవతాడ వచ్చితా - చాలంగ నొచ్చె
ఆకాలకంఠుడు - నటు లోడిపోయె
నీతని గెలువగా - నెవ్వరి వశము
ఈయతీశ్వరుని పే - రెవరు తలచినను
వైరుల గుండెలు - వ్రక్కలై పోను
ఉపవాసముల చేత - నొడలెల్ల స్రుక్కి
యెలమి యెఱుగని వాని - వలె నున్న నాడు
అడవులే మేలాయె - నామునిపతికి
పండ్లు ఫలమ్ములు - భక్షింపు చుండు

ఆకలి గొన్నప్పు - డాతని భిక్ష
కరసి యన్నము పెట్ట - నండ లేరెవరు
కార్యాని కోసమే - కడు చిక్కు పడెను
కార్యము చేసి గ్ర - క్కున నంపవలెను
సుదతి యీతని జూడ - సురపతి సుతుడె
మనసులో నీ కను - మానమ్ము వద్దు
కన్య నీచేతి భి - క్షమె కాని యతడు
అన్యులచే భిక్ష - అందుకోబోడు
దానిచే నీకు నిం - తగ జెప్పవలసె
నెప్పటివలెనె నీ - వీ యతీశ్వరుని
తప్పక పూజించు - తరుణి పొమ్మనిన
అన్న మాటలకు తా - నంగీకరించి
మత్తేభగమన గ్ర - క్కున లేచి వచ్చె
అందెలు కదలంగ - హారముల్ వెలుగ
మదిరాక్షి వనుదెంచె - మానియింటికిని
పొనగ నానాటి క - పూర్వమ్ము గాను
అఖిల పదార్థమ్ము - లాయత్త పగచు
పిండులు కావించు - వేవే విధముల
పొందుగా నతనికి - భుజియింప నిడును
వలపుతో నవియెల్ల - వరుస భుజించి
కడు డస్సి యుంటకు - కారణా వేమి

ముాచూపు లీలమక - మీావిలాసములు
యేతాపసుల యందు - నెఱుగ మెన్నదును
విజయుని రూప వి - వేక సంపదలు
గజరాజవరదుచే - గరిమ నే విందు
తెగవాలు కన్నులు - దీర్ఘ బాహువులు
వగడంపు వన్నెగల - పాదపద్మములు
చూడగా నీతండు - క్రీడియే కాని
వాలాయముగ యతీ - శ్వరుడు గా బోడు
కపట సన్యాసిగా - కల్పించి యిచట
వుపమను శ్రీకృష్ణు - డునిచినా డేమొ
అని మనమున జాల - హర్షమ్ము నొంది
శృంగార మమరించె - చెలియ సుభద్ర
పైకొనియెద నంచు - పద్మాయతాక్షి
జోకతో కమ్మ క - స్తురి నలు గిడెను
జాతి గొజ్జగి నీట - జలకమ్ము లాడి
రీతిగా నొకవింత - రేఖ చూపట్టి
ఉమ్మెత్తపువ్వు వలె - నుతికిన మడత
నఖముల గొని తెచ్చి - నాతి యిచ్చినను
చెంగావి పావడ - రంగు మీాఱంగ
చుంగు విడిచి కట్టె - సుదతి సుభద్ర
పాలిండ్లవలను క - న్పడగ నొకవింత

లీల పయ్యెద కొంగు - లే జాఱి విడిచె
నటనతో పైనము - నడచేటి మగువ
రమణ బాగుగ కొంగు - రంగుగా జెలగె
జవ్వాజి పదనిచ్చి - చంద్రకాంతముల
దువ్వెన నెరగోర - దువ్వెన కురులు
పాపట నొసంరి - బాగుగా దీర్చి
చూపట్టు కొప్పు నిం - చుక జాఱి ముడిచె
మల్లెలు మొల్లలు - మందారములును
చల్లని జాజులు - సంపంగి విరులు
పారిజాతమ్ములు - బాగుగా తీర్చి
యొయ్యారె తుఱిమె నా - యుత్పల గంధి
విటుల మన్మథు డేయు - విరిమొగ్గ తూపు
నటన గుమ్మడి గింజ - నామమ్ము తీర్చె
బసిడి ముత్యాల నొ - ప్పగ పూర్ణచంద్రు
శవమించు చెవుల తా - టంకాలు చేర్చె
మొగపు తీగెసు చెంత - ముత్యంపు కోలికి
జిగిమణుల్ మిగులు మం - జిడి తాళి జేసె
పుంజాల దండ దా - పున నేవళమ్ము
రంజిల్లు భన్నస - రమ్ము క్రీడించ
యిన్ని సొమ్ములకును - వన్నె బెట్టిసటు
మూడు వేల్ వెలసేయు - ము క్కఱ బెట్టె

కుంకుమ గంధము - కూర్చిన మంచు
గోవకస్తురి బూసె - కొమరారు మేన
వచ్చి పోకలతోడ - పండు టాకలతో
గమ్మన కపుర పీ - డెమ్ము గావించె
ఆరామచిలుక భు - జాంగదమ్మునను
రాజసమ్మున సునిచె - రమణి సుభద్ర
ఝుణఝుణత్కారముల్ - సలుప సొమ్ములును
వచ్చలరుచుల స్తం - భమ్మునూటునను
మత్తాక్షి నిలుచుండె - వాని జూచుచును
బృందావనము మీద - వెలయు నా వాని
కమలార్క బింబంబు - గతి బోలువాని
బాలేందుచాయల - పగిది నిరుగడల
నెమ్మిగప్పుటూర్ధ్వ పుం - డ్రమ్ముల వాని
నొప్పు దందురకావి - నూటార్చిపట్టు
కప్పారు నిడువాలు - గడ్డము వాని
మొలకెత్తు ముత్యంపు - మొగ్గల బోలు
తళుకొత్తు శుభ్రదం - తమ్ముల వాని
అలవడు తులసి పూ - సలపేరు వాని
కవగూడ హరినీల - కాంతి తేలించు
తమ్మిపూసల దండ - తన కురము సొంపు
సొమ్ముగా సవరించి - చూపట్టు వాని

మున్ని విధంబుల - నున్న యా మాని
జూచి సంతోషమున - సుదతి యిట్లనెను
అడిగెద నని పూని - అతివ సుభద్ర
తనమనములో నున్న - తాత్పర్యమునను
చిత్సౌఖ్యరసలత - చిగిరించ గాను
ఉత్సాహమున మేను - ఉబ్బి పొంగగను
పలుకు పల్కుకు తేనె - లొలుకగా నపుడు
పలికె దా నొకమాట - పద్మాయతాక్షి
అయ్యా మీ రేదేశ - మనసి చూచితిరో
మియ్యాది మీనామ - మెచట నుండుదురో
పరగ నింద్రప్రస్థ - పట్టణమ్మునను
బహుళ సంపదలతో - బరగు చున్నారు
నేమమానసులు కుం - తీసుతుల్ వారు
ఆరయ గడు సుఖు - లై యున్నవార
శౌరి మా మేనత్త - కొడుకు లైదుగురు
వారికి కుశలమా - వరమునిచంద్ర
ఆరాజవరులలో - నర్జునుం డెలమి
ధారుణి తీర్థముల్ - దరిసింప నేగె
తీర్థముల్ క్షేత్రముల్ - తిరుగుచో మీరు
ఇంద్రనందను నొందు - నే జూడలేదా
జగతి నంతట మీరు - చరియింతు రనగ

అంసి మి మ్మిపుడు - అమగంగ వలసె
హరిపాదముల బుట్టె - నట్టి యాగంగ
భూతలమ్మున వెలసి - పొలు పమరు చుండు
మతి నట్టభద్రుడు - మాయన్న కతడు
వంగన మర్పింప - నందు బోబోలు
నని మున్న వింటి నే - నతడు తా నిటను
ననుదెంచు టెరిగితే - నంయమినాథ
యీ ద్వారకాపురి - యెంతో దూర మని
తన పురమున కట్టె - తా నేగె నేమొ
అని యిట్లు తా బల్క - నా మునీశ్వరుడు
మౌనమ్ముతో నుండె - మతి కొంత సేపు
ఓ మునిపుంగవ - యో పుణ్యమూర్తి
గంగాతరంగభం - గక్రమశుభ్ర
పాథోభర న్యాయ - పర భక్తియోగ
నాథ నా దైనమ - నవి చేకొన గదె
అనుచు సుభద్ర దా - నాడు వాక్యములు
విని చెవిపండుగై - విజయు డిట్లనిమొ
పద్మాక్షి నీతోను - పలుకగా వెఱతు
పలికిన పలుకులు - భావ మేర్పఱచి
మాఱు లెక్కించెదో - తోయజాక్షునకు
వలపు గల్గక యుండ - పలుక గల్గుదునె

పడుచుదనమున నే - పలుకు పల్కులను
మనసులో నుంతువా - నను రాజఋషిని
అను మాటలనువిని - యర్థాంతరములు
లేమ లో భావించి - లేనవ్వు నవ్వె
కామతంత్రము రహ - స్యములు పుష్పించె
చక్కని ముఖ పద్మ - సారస్య మెంచె
చిక్కని నెమ్మేని - జిగి విచారించె
తిన్నని మాటల - తేట లాలించె
సన్నంపు నదరంపు - చామ వర్తింపు
మొలక నవ్వులదీవి - ముగుద కెమ్మోవి
తరలాక్షి చెక్కిళ్లు - తరుణి పోకిళ్లు
తిలకించి పులకించి - కలజూచి చూచి
తల యూచి విజయుండు - తానెద గందె
యిటు వంటి బోటికి - యీకోడె కాడె
నచ్చిన వాడని - నాతి నాతరుణు
నచ్చుగా పుష్పవింట - నతనుండు గొట్టె
బృందావనము మీద - ప్రేమతో మాని
కందువ దెలియక - కడు మూర్ఛవోయె
ఓ ముద్దుచిలక ! నే - నుల్కిపల్కితిని
వల దింక వల దని - వ్యవహరింపుచును
బడలిక గొని మాని - పవలించె నంత

వారామచిలుక ఫ - క్కున నేగు దెంచె
పసిడి రెక్కలు - సొంపు లెసగి యాడగను
మాణిక్యపుంగంర - మాలికల్ మెఱయ
పార్థునిభుజముల - పై నిల్చి యపుడు
నయభయములతోను - నరుని కిట్లనెను
కావ లేలెమ్మని - బడలికల్ తెలిపి
మోవి గంటిని చేసి - ముద్దులు వెట్టి
యిదియేమి విజయుడా - యీరీతి నుండ
అన్నిట గుణశాలి - వౌదువు నీవు
అర్జున నీమన - మలరుచుండగను
నిర్జరీగతి నాతి - నిన్నతా నడిగె
నెలమి దుర్యోధ నున - కిచ్చెద ననిన
కడు తాపమును బొంది - కాంత నిన్నడిగె
యిరువురిమనసులో - నెల్ల తాపములు
నెఱిగియు నెఱుగని - తెఱ గుండవలెను
ఇంతిని తోడ్కొని - యింద్రప్రస్థమున
కెంతో వేడుకల నీ - వేగుదువు గాని
కమలాక్షి పెంచిన - కడుముద్దుచిలుక
నడుగవలె నా నీకు - అన్నిబుద్ధులకు
నుం దేమేలమ్ములకు - మఱి వేళ గాదు
అనుచుముంజేతికం - కణముపై వ్రాలె

ఓచెల్ల యని మతి - నాచకోరాక్షి
తడయక తలపోసి - దా నప్పు డడిగె
నెచ్చట నున్నాడొ - యెలమి నర్జునుడు
తీర్థమ్ము లేవేవి - తిరుగుచున్నాడొ
యేపుణ్యభూముల - కేగి యున్నాడొ
వినిపించు మనె - నామె తనకు తెల్లముగ
అనియిట్లు పలుకగా - నామునీశ్వరుడు
అమరగా బలికెను - అతివరో నపుడు
కోమలి యుద్ధఅము - గోకర్ణ మందు
కూడియే యుంటిమి - కొన్నాళ్లు లచట
భోజనమ్ములు శయన - ములు నొక్క చోట
చెలియ యుంటిమి మేము - చెలికాండ్లవలెను
అతనికి నాకును - అరమరలేదు
అతనికినా కైక్య - మతివరో వినవె
నీరూపు నీరేఖ - నీచక్కదనము
వేమారు తలపోసి - వివశుడై యుండు
నిదురేయిపగలు కం - టికి కూర్కలేద
యింతి నీపై మోహ - మెనగొనియుండు
నెలమి నర్జునునిరూ - పెఱుగనే తాను
రూపేల గోరగ - నోపల్లవాంగి
మందారదామమా - మాయన్న చేత

విందుగా నెన్నడు - వెన జూడ లేదు
యెగుభుజమ్ములవాడు - మృగరాజునడుము
నడచి పుచ్చుకొను నె - న్నడుముగలవాడు
గరగరనివాడు చ - క్కని వాడు నతడు
గొప్ప కన్నులవాడు - కోదండగుణకి
ణాంకంబు లౌబాహు - లమరినవాడు
వెన్నున మచ్చగల - విభవంబువాడు
బవిరి గడ్డమువాడు - పన్నిదం బిడిన
వెన్ను పగడసాల - వెస నాడవచ్చు
చిగురొత్తు చెంద్రిక - చెలగు పాదనులు
నని విధం బెఱిగింప - నంతట నరుడు
నీవు గుణాఢ్యవు - నీకెవ్వ రెదురు
శ్రీహరి చెల్లెలా - శృంగారవతివి
యేపున నీభాగ్య - మేమన వచ్చు
నీవు కిరీటికి - నెలత వై తేని
భావింప నాతని - భాగ్యమే కాద
పూని నీ వడుగగా - బొంక నేమిటికి
మానిని నేనె పో - మఱి యర్జునుడను
నన్ను మన్నించి మీా - యన్న శ్రీకృష్ణు
నిన్ను నా కీవలసి - పన్ని నీవిధము
నీకోర్కి నాతలపు - నిగమగోచరుడు

సుభద్రాకల్యాణము

చేకొని సమకూర్చు - చింత యేమిటికె
అరయ గంధర్వ క - ళ్యాణమ్ము రాజ
వరులకు తగునండ్రు - వరధర్మ పరులు
అనుచు తమకమ్ముతో - అతఁడు చేయి చాప
ఘనమైన సిగ్గుతో - కాంత యిట్లనెను
తల్లియు దండ్రియు - తగిన బాంధవులు
బల్లిదు లన్నలు - పాయ కున్నారు
వారి యనుజ్ఞచే - వర్తించు మిచట
నీలాగు పనులైన - యిందఱు నగర
వారి నీకు నిచ్చునట - అనుమాన మేల
తెలిసి యేనుగునెక్కి - దిక్కు దూరెదరె
అని చెప్పి తా నగరి - కరిగి పోయినను
మునియు లతాగృహ - మ్మున కపుడు చనియె
మదనునిచే జిక్కి - మత్తాక్షి రాక
కెదు రెదురై చూచి - యిట్లని పలికె
యింతికి నాపేర - దేల చెప్పితిని
కాంతయు లోనికి - గ్రక్కున బోయె
మరుని పుత్తడిబొమ్మ - మరలె నాచేతి
పరిచర్య లొనరించ - భాషించ దొక్కొ
సుందరి పాదాల - యందియల మ్రోత
విందునో వీనుల - వెరగందు నొక్కొ

తెలిసోగ కన్నుల - తెలియగ లేమ
గాలయక తా జూడ్కి - చూచునో లేదో
కొమ్మలతో గూడ - గుజ్జన గూళ్లు
అమగువ వడ్డించ - హర్షించ దొక్కొ
తేమిచేయుదు నిట - కింకొకసారి
కామిని చనుదెంచి - కరుణించ దొక్కొ
భామ కావలెనని - మన్నించి రాజ
కాముడు దన్నువే - కారించ దగున
ఉన్నమా తల పెల్ల - నుర్వీధరుండు
ఏన్నగా తనమతిని - భావించ దెలిసె
ఘనమందిరములకు - గ్రక్కున వచ్చి
తొలమి రుక్మిణి జూచి - యిట్లని పలికె
నెలత నీమరదలు - నేను సన్యాసి
బలభేది సుతుడాట - పరికించి తెలిసె
మలయుచు వచ్చి తన - మందిరమ్మునకు
తలకొన్న సిగ్గుతో - దా జేరదాయె
అరసియన్నము బెట్టు - మనుచు నియమించి
గారిది వినోదముల్ - చూచుచు నుండె
అంత నక్కడ మటికె - యాసుభద్రయును
చింతించి చెక్కిట - చెయిబూని యుండి
మదిలోన తలపోసె - మగువ యిట్లనుచు

యింద్రనందనుడు మ - హేంద్రసుతుండు
చేరి వినయమ్మున - చెట్టబట్టినను
విడిపించుకొని మఱి, వేగ బోయితిని
ఎలమి నాతని మన - స్సెట్లుండెనొక్కొ
కాక దానొడబడితే - కడుచుల్కదనము
యీకడ సందటి - కెన్నిక కాద
యెఱుగడా నాకేల - యింత చింతించ
నిరవైన యీపెండ్లి - యీడేర్చు తనకు
అనుచు చింతింపుచు - నతివ సుభద్ర
హంస తూలిక పాన్పు - నందు పవళించె
ముత్యాల చెఱగుతో - ముసుకు తాబెట్టె
ఆయంబుజాక్షియు - నచటి కరుదెంచి
ఆ మరదలి జూచి - యటు నవ్వి పలికె
కనులేల మూసేవె - కలహంసగమన
శిరసేల వంచేవె - సింహేంద్రమధ్య
వాలుకన్నుల నీరు - రాల నేమిటికె
వనిత సన్యాసిని - వలపించుకొంటి
రామావతారాన - రమణిరో సీత
శాంతయను పేరుతో - సహజాత వైతి
అల ఋశ్యశృంగుని - అటులోను జేసి
వలవేసి కొంటివే - వనితరో సీత

దేవేంద్రసుతుదృష్టి - తెగువతో తాకె
దృష్టి తీయింతుమే - తెలివి రా నీకు
తెగవాలు కన్నుల - దృష్టించి చూడ
అతనిచేతనె కాని - అది మాన దనెను
చిటిమిటి కోపాన - చెలియ సుభద్ర
కరకంకణములచే - కాంతి శోభిల్ల
ఆరుక్మిణమ్మను - ఆవలికి ద్రోసె
గట్టిగా ముసుగిడి - కాంత యిట్లనెను
యింతి నీపలికిన - యీపలుకు లన్ని
త్రైలోక్య పతితోడ - తా విన్నవింతు
అనిన మరదలి జూచి - అతివ యిట్లనెను
యిప్పుడే చెప్పవే - యిభరాజగమన
మీరాయన్న మముగూర్చి - మించనాడునటె
జలక మాడుదు లేవె - చెలియ సుభద్ర
చలువ గట్టుదువులే - చందనగంధి
భుజియించుదువు లేవె - పుత్తడి బొమ్మ
తెలది నీకును పెండ్లి - వేగ జేయుదుము
అనిచెప్పి వైదర్భి - యరుదెంచె నంత
నందమౌ సిందిరా - మందిరమ్మునకు
అయింతి పెట్టె నా - యాసొమ్ము లన్ని
తాటంకముల కాంతి - ధవళింపగాను

మొలనూళ్ల ఘంటలు - మొల్లముగ మ్రోయ
నొయ్యనె తనపదు - మూగాడెగాను
ఇంతి పయ్యెదలోన - నేకాంతమునను
ఆచక్రవాకములు - జతివ హారములు
కొమరార కొప్పులో - గొజ్జంగి దండ
నటనతో వీపున - నాట్య మాడగను
జాఱుపయ్యెదకొంగు - చక్క ద్రోయుచును
ఊరిది ముత్యపు సరులు - నుయ్యాల లూగ
ఆదనారాయణుం - డఖిలాండనాథు
డండజపు పానుపున - అతడుండ తెలిసి
కోవెల స్వరముతో - కొమరాలు పోయి
చిలుక పలుకులతోను - చెలి విన్నవించె
పుండరీకాక్షు డా - పురుషోత్తముడ
సురవైరి వందిత - మ వ్వగోపాల
నారద వినుత యా - నంద ముకుంద
మత్స్యావతార నా - మనవి చేకొనుము
యింతకార్యం బని - యెఱుగని యట్లు
కవ్వడి నేచుట - కామధర్మంబె
అని చెలి యున్న వృ - త్తాంత మంతయును
నెఱిగించె కృష్ణున - కెలమి రుక్మిణియు
హరి వారి తల వంత - నంతయు దెలిపె

వరుసతో దేవకీ - వసుదేవులకును
సారణ ప్రద్యుమ్న - సాత్యకులకును
ఆరూఢి నుద్ధవు - డప్పు డాతెలుగు
అయింద్రసుతునకు - ఆసుభద్రకును
నెయ్యమి కలుగుట - నేర్పున దెలిసె
చయ్యన తనకోర్కె - సమకూడె ననుచు
తొయ్యలి నపుడు పా - ర్థున కియ్యదలచె
ఆయచలమ్మున - యాదవు లెల్ల
భూరి మహోత్సవ - మ్ములు చేయుచుండ్రి
ద్వారకలో సుభ - ద్రా కన్య యుండె
బలరామ కృష్ణులు - పర్వతమ్మునకు
చేయించుచుండిరి - చెలగి యుత్సవము
తమయన్న కృష్ణుని - తలచె సుభద్ర
అమరేంద్రుని దలంచె - అర్జును డపుడు
అంతట శచితోడ - అమరపతి వచ్చె
అచట ముత్తైదువ - లాయరుంధతియు
శచి రుక్మిణీదేవి - సత్యభామయును
ఆవధూవరులకు - నతివ లందఱును
సంపంగి తైలము - చక్కగా నంటి
జలక మిద్దఱికిని - సరగున దీర్చి
దివ్యవస్త్రమ్ములు - దివ్యగంధములు

దివ్యమాల్యమ్ములు - దివ్యభూషలును
ధరియించి రవుడు వా - ద్యధ్వనులెసగ
గరుడ గంధర్వులు - గానముల్ సేయ
అలవడ బరగిన - ఆశంభురాణి
సతివపూజించిన - నాయరుంధతియు
మృగనాభివాసనల్ - మొగి గుబుల్ కొనగ
జనులెల్ల పెనగొని - చౌకళింపుచును
అందముగ మృగమధ్య - లమర బోడుచును
కల్యాణవేదికి - కడువేగ రాగ
నాదరాన సుభద్ర - కార్జునునకు
వేదోక్తమున పెండ్లి - విష్ణుండు చేసె
ఆసమయమ్మున - సమరవల్లభుడు
భాసురమణిమయ - బహుభూషణములు
ఘనమకుటమ్మును - కవ్వడి కొనగి
అనురక్తచిత్తుడై - హరి వీడుకొనిన
అపుడు సుభద్రయు - నార్జునుండు
శచికి దేవేంద్రునకు - సద్భక్తి మ్రొక్క
మ్రొక్కిన యిరుగుర - మొగి లేవనెత్తి
ఆశీర్వదించి యా - యమరేంద్రు డరిగె
నిర్జరుల్ తామును - నిజపురికి నేగ
అర్జును జూచి కం - సారి హర్షించ

అప్పుడు కవ్వడి - యాసుభద్రయును
హరిపాద పద్మముల్ - హర్షమున మ్రొక్క
కడు గారవమ్మున - కౌగిట జేర్చి
కడలేని యక్షయ - కాండము లొసగె
రయహయంబుల హేమ - రథమును నొసగె
హరియు రుక్మిణి జూచి - అప్పు డిట్లనిరి
అలరెడి వేడుకల - ననుగు మరదలిని
హోమ పీఠమ్మున - నునిచిరివారు
అక్షతల్ శిరసుపై - నాయిఃర్వురుంచి
ముత్య రత్నమ్ములు - ముగుద యొడినిడిరి
సిగ్గుమురిపెమ్మున - చెలియ సుభద్ర
వద్దికి చనుదెంచె - వదిన ముందటికి
పుత్తడి బొమ్మవలె - పొలతి సుభద్ర
వదిన పాదములపై - వ్రాలుచు మ్రొక్కె
మ్రొక్కిన మరదల్ని - మొగి గౌగిలించి
అక్కున జేర్చుకొని - అతివ యిట్లనెను
అడల నేమిటికె మా - యమ్మ సుభద్ర
అత్తయు నీకు మే - నత్తయు గాన
వింతవారెవ్వరు - వీరిలోపలను
బావమఱదులు చాల - భక్తి గలవారు
నిను విడిచి మాయన్న - నిమిష మేనియును

గెలువ రిప్పుడె నిన్ను - బిలిచి తెచ్చెదరు
పొల మువ్వ నిప్పుడే - తా బిలువ గాని
యిచటికి బోయి రా - యిభరాజగమన
నానదినె యుండవే - నా ముద్దుచిలుక
అని బుజ్జగించేటి - ఆసమయమున
ఘనకోటిసూర్య ప్ర - కాశమ్ము భాతి
మకుటమ్ము ధరియించె - మఱియు నర్జునుడు
వెచ్చెసె నంతలో - విజయుడా సతికి
సచ్చిక దండ ప్ర - ణామమ్ము జేసె
శిరజాత్మునిరాణి - నిత్యకల్యాణి
దారిద్ర్యనాశిని - దయగల తల్లి
పాండునందనులకు - ప్రాపనై యెపుడు
కృప జూచి రక్షించు - కువలయనేత్ర
మన్మథుని గన్నట్టి - మరువంపు మొలక
మమ్ము కటాక్షించు - మాధవు రాణి
అనుచు ఫల్గునుడు త - న్నతిభక్తితోడ
స్తవము జేయుచునున్న - కువలయనేత్ర
మకుటమ్ము వట్టి క - వ్వడి లేవనెత్తె
సత్యకృపాచార్య - సత్యసంపన్న
సత్యము దప్పని - సర్వజ్ఞ నరుడ
చెలువతో సద్భక్తి - శ్రీకృష్ణుసేవ

కలిగుండు నీ వెల్ల - కాలంబునందు
ననుచు దీవన లిచ్చి - నాసమయమున
నక్కున జేర్చుకొని - అతివ కిట్లనెను
చనవిచ్చినాడని - సకియరో నీవు
పలుమాటలకు నెట్లు - పాలుపడవద్దు
పొలతి నమ్మగరాదు - పురుషుల నెపుడు
పలురీతి గృష్ణ న - గ్నమ్ముగా యుండ్రు
కొంచక కృష్ణకు - కూర్మితో నుండు
వంచన సేయకు - వనిత యెప్పుడును
అనుచు బుద్ధులు చెప్పి - అనుగుమరదల్ని
అర్జునుచేతి కో - య్యన నప్పగించి
కోరిక కొనసాగె - కొమరాల నీకు
ఇంద్రనందను గూడి - నేగు మాయమ్మ
అరుగుమి నీవని - అతని వీడ్కొలిపి
నరసఖు డేగె నం - తర్ద్వీపమునకు
అరిగిన పిమ్మట - నపుడు కవ్వడియు
దేవకీవసుదేవ - దేవులకు మ్రొక్కి
వారిదీవన లంది - వనితను తాను
చయ్యన చనుదెంచి - సత్యభామకును
పరభక్తితో మ్రొక్కె - వనితయు తాను
అన్న అర్జునుడ యా - అతివతో గూడి

ఘను వీరు పుత్రుని - గాంచు వేగముగ
అనుచు దీవన లిచ్చి - అతివ యాక్షణమె
అరుగుమి నీవంచు - నతని వీడ్కొలిపె
నరసఖుం డరిగె - నంతర్ద్వీపమునకు
అనిపిన పిమ్మట - నపుడు కవ్వడియు
రథముపై నునుచుకొని - రమణిని నపుడు
పోయేటి వేళలో - పురి గాచియున్న
ఆయుధవాహకు - లారీతి నైరి
ప్రవరసేనుడు కృత - వర్మ యాదిగను
శౌర్యమున నానవ్య - సాచి నడంప
నోరోరి పాండవ - యుద్దండవృత్తి
మారామకృష్ణులే - మఱి లేమి జూచి
యీలేమ తోడ్కొని - యెందు బోయెదవు
తాలాంకుశౌర్యము - తలపవే మదిని
పాలతి నీవెత్తుకొని - పోయితి వేని
బలునారసమ్ముల - బడవేతు మనిరి
ఘనగిరితటుల సం - దనవనంబునను
కినిసి బాణమ్ములు - క్రిక్కిఱియనేసె
రమణి సుభద్ర సా - రథ్యంబు సేయ
అమరేంద్రనందను - డాసమయమున
కడు కోపమున దన - కాండములచేత

చెనకి వారల నెల్ల - చీకాకు జేసి
ఇంతిని దోడ్కొని - యింద్ర ప్రస్థముకు
సంతోషమున జనె - సవ్యసాచియును
శౌరిపై కనుగొని - సంకర్షణుండు
నీరజోదరుడును - నీలాంబరుడును
ఘనభరితాంబర - కనకాద్రినిభుడు
నేర్మితో చనుదెంచె - నీలవర్ణుండు
బలుతమ్ము జూచి బల - భద్రు డిట్లనియె
యేమి కార్యము గల్గె - యిందాక నీకు
మాన వెన్నటికిని - మందె మేలములు
ఆహోగ్రుడై మించు - నన్నను జూచి
కపటనాటకధారి - కప్పె నొకమాయ
నాగమల్లియతీగ - నవమల్లెతీగె
కలసి పెనగుచునున్న - కడువింత జూపె
నచటి సభాస్తారు - లాసమయమున
పచరింప నర్జును - బహుపరాక్రమము
విజయ నిర్ఘోషముల్ - భేరీరవంబు
రామాది యాదవ - ప్రకరముల్ గొలువ
మదిలోన నుబ్బింతి - బెదరైన గొనక
పనివినె నరుడు సు - భద్ర దోడ్కొనుచు
పొదలిన వేడ్కల - బోయె నాకేమి

అటు పట్టితెచ్చేము - యిటు మమ్ము బనుపు
మిదెయని చారులు - నీవిధి బలుక
విని వారి సంధతి - వేగ వారించి
బలభద్రుతో నిట్లు - పలికె శ్రీకృష్ణు
డనఘుడు ధర్మజ్ఞు - డతినీతిపరుడు
తన మేనమరదలి - తాను గొంపోయె
వలదని యెవరికి - నారింప వశము
బలవంతు డాతడు - బహుశస్త్రవేది
అటుగాక ద్రోణుల - కనుగు శిష్యుండు
కదనములో వాని - కదియంగ దరము
యెదిగిన కన్య మన - యింటిలో నున్న
మనము చేయకయున్న - మగువ బెండ్లాడె
తలప నీపనులకు - ధర్మమా యనిన
నబ్జాక్షుమాట కం - తౌను గాదనక
తాలాంకు డప్పుడు - తలయూచి యుండె
తల్లియు దండ్రియు - తగిన బాంధవులు
బల్లిదు లన్నలు - పాయకుండంగ
నొకపేద వలె పాయ - నుచిద సుభద్ర
సుదతి నీరీతిగా - చూచుచుండుమనగ
అని వెడబాటుగా - నన్నతో జెప్పి
అనుగు చెల్లెలికిని - అరణముల్ గొంచు

లక్ష గుఱ్ఱమ్ములు - లక్ష యేనుగులు
అక్షీణ బాహుబలు - లగు వీరభటులు
రమ్యకాంచనమణి - రథసహస్రములు
సౌందర్యవతులైన - సతిసహస్రములు
అన్నయు తమ్ముడు - నతిమోదమునను
అరణమ్ము దెచ్చిరి - యతి శీఘ్రమునను
వనితతో చనుదెంచి - వరు డర్జునుండు
వాసిరి సాద్వైత - వనములో నుండ
అచటికి చనుదెంచి - రన్నయుం దాను
సరణమ్ము లిచ్చిరి - ఆదంపతులకు
అపుడు సుభద్రయు - నాయర్జునుండు
ఆరామకృష్ణులకు - నతిభక్తి మ్రొక్క
మ్రొక్కిన యిరువుర - మొగి లేవనెత్తి
విజయుడవుగమ్మంచు - వేడ్క దీవించ
విజయు డాతట వారి - వేడ బూజించె
సంతోషచిత్తులై - చనిరి ద్వారకకు
అపుడు సుభద్రయు - నర్జును గనియె
యీ చందమున నన్ను - నీక్షించి కృష్ణ
యేమని పలుకునో - యీ రసమ్మునను
ఆపలుకు లన్నియు - సటు తాకు నేమొ
గోపాలసతులతో - కూడ నన్ను నుపు

మానిన సంతోషించి - యాయింతి కనియె
ద్రౌపదికిని మ్రొక్క - తరుణి పొమ్మనిన
వనిత ప్రవేశించి - వచ్చె నవ్వేళ
కుంతికి కృష్ణకు - కూర్మి మ్రొక్కినను
సంతసం బలర పాం - చాలి యిట్లనెను
వనిత నీపతి వీర - వరు డయ్యె నేని
ఘనవీరపుత్రుని - గాంతు వీ వనెను
అంత దీవన లిచ్చి - యపుడు పాంచాలి
సంతోషమున నుండె - సకియతో గూడి
అపుడు ధనంజయుం - డాయింద్రపురికి
వచ్చి ధర్మజునకు - వరభక్తి మ్రొక్కె
తల్లికి సాష్టాంగ - దండ మ్మొనర్చి
వాయునందనునకు - వందనముచేసె
తనకు మ్రొక్కినయట్టి - తమ్ములనెత్తి
కడు మోదమున తన - కౌగిట జేర్చె
నతివ పాంచాలిని - నక్కున జేర్చె
అంతట ధర్మజుం - డతిమోదమునను
దోగుచు బాంచాలి - తో నిట్లు పలికె
పార్థునకును మాను - భద్ర కిప్పొద్దు
శోభన మగుగాన - చూడు వేడుకన
నానతి గైకొని - యపుడు పాంచాలి

వేవేల యత్నముల - విందు తగజేసె
నొప్పైనబంగారు - టుప్పరిగలోను
కప్పురవాసనల్ - గ్రమ్ముకొనంగ
సాంబ్రాణిధూమముల్ - సఖి తానువేసి
చిత్రముల్ నిర్మించె - చెలియ యంతటను
దిక్కుల మాణిక్య - దీపముల్ వెలుగ
నిలువుటద్దమ్ముల - నెలత చెక్కించె
వెయ్యి దీపమ్ములు - వెలుగంగ నందు
గవుసెనల్ దీయించె - గాజుకంబముల
బంగారు తరికోళ్ల - పట్టెమంచమ్ము
అంగన వెలయించి - యమరించె సెజ్జ
సన్నవిరిమల్లెలు - జాజిమల్లెలును
బొండుమల్లెలు చాల - నిండ బరపించి
యిరుదెసల్ తలగడ - లిమ్ముగా దాపి
బంగారు సురటి దా - పణతి వెట్టించె
పచకించి బాగాలు - బరణులం బోసి
గాలించి సున్నము - కాయ బెట్టించె
పండుటాకులు దెచ్చి - పణతి మడిపించి
మదిరాక్షి యునిచె ను - మఱియు నచ్చటను
చాఱపప్పు గసగ - సా లానవాలు
శ్రీసుగంధమ్ములు - చిటిబెల్లములును

చెఱుకుబిళ్లలు మంచి - చిఱువిండి సరకు
పసిమిమామిడి పండ్ల - రసములు పిసికి
పసిపచ్చ గిన్నెల - పాలు నే నినిచి
పలువన్నెగిండ్లతో - పన్నీరు నించి
బంగారు చెంబుల - పానక మునిచి
బుంగల దింపించి - గంగోదకములు
పలుకుచిల్కల నుంచి - పంజరమ్ములను
ఈరీతి పనులెల్ల - నింతి తగజేసి
చనుదెంచె పాంచాలి - సంభ్రమమ్మునను
భద్రేభగమన సు - భద్ర రమ్మనుచు
చేడె శృంగారమ్ము - చేయంగ దలచె
పన్నీట స్నానంబు - బాగుగా నార్చి
తడిబోసి కట్టించె - ధవళవస్త్రమ్ము
విసనకఱ్ఱలగాలి - వీచె నిరుదెసల
పొసగగా తడియార్చె - పొలతి శిరస్సు
ధూపవాసనల లో - దులిపి యల్లార్చి
గొజ్జంగిరేకులు - కొప్పున దుఱిమె
నొడ్డాణమును బెట్టె - నూగాడు మొలను
బిళ్లల మొలనూళ్లు - బిగిసి మ్రోయగను
ఘంటల మొలనూళ్ళు - ఘల్లున మొరయ
కంఠహారమ్ములు - కౌస్తుభమణులు

కాలిపెండెముగూర్చె - ఘనతతోడుతను.
అందెల దిద్దె నా - యతివ సుభద్ర
తళుకు మించిన సాది - దండల పైని
నెలవంక తాయితల్ - నెఱి వ్రుట్ట గట్టె
శ్రీకారములతోడ - చెలగాడు చెవుల
కమలాక్షి పంజుల - కమ్మలే పెట్టె
సొమ్ము లిన్నిటి మీద - శోభిల్లు నట్టె
మూడువేలుం జేయు - ముక్కుఱ పెట్టె
కుంకమ గంధము - గూర్చె నా యింతి
గోవకస్తురి బూసె - కోమరాలిమేన
ఆనవాల్ పాయసం - బొవులనేయి
పాలతు లందఱు గూడి - పాత్రారగించి
పచ్చివా పోకల - పండుటాకులను
వెచ్చగా కప్పూర - వీడెమ్ము జేసె
గరిమతో రాచిల్క - కంకణమ్ముసను
రాజసమ్ముసన నిచె - రమణిసుభద్ర
ఝుణఝుణత్కారమై - పణతులిద్దఱును
జోడుచిల్కలవలె - శోభిల్లి రపుడు
అక్కడ ధర్మజుం - డర్జుననకును
అతిర క్తితో నలం - కృతులు నేయించె
సవ్యసాచిని జూచి - సన్న గావించె

శయ్యాగృహమునకు - నొయ్య బొమ్మనుచు
వెస నన్నపాదార - విందములు మ్రొక్కి
పానుపు కడకేగి - పార్థు డంతటను
యెదురుసూచుచునుండె - నింతిరాకలకు
మఱచిన తన్నింత - మఱవనీ కుండ
వచ్చునివింటివా - డెచ్చరించుచును
వేదన కలవిచ్చు - విరహాగ్ని చాయ
ప్రోది చేసినయట్లు - పొదలె చంద్రుండు
అప్పుడా ద్రౌపది - అతివతో ననియె
పట్నమ్ములో వారు - ప్రహరి దిరిగెదరు
పడతిరో పదునాఱు - ఘడియ లటు చనెను
సజ్జకు జను మన్న - సకియ యప్పుడును
సిగ్గున మురిపెమున - చెలియ సుభద్ర
అడుగు లోడకయుండి - అటుకొంతసేపు
కూరిమి గలవాడు - కోమరాల నీకు
మేలిమి గలవాడు - మేనత్త కొడుకు
నాల్గునెలలు భిక్ష - మే ల్లగ్గ బెట్టి
యిప్పు డిటువలె సిగ్గు - లేటికే సుదతి
అనుచు సుభద్రను - అతివ తోడ్కొంచు
విజయుని పాన్పున - వేడ్కతో నుంచె
తలుపులు మూసికొని - తరుణి యేతెంచె

తలపోసె మనసులో - తాళంగ లేక
ఏమి వస్తువైన - నియవచ్చు గాని
ప్రాణము నిచ్చి మరి - బ్రతుకంగ రాదు
అఖిలాండ కోటి బ్ర - హ్మాండనాయకుని
చెల్లెలు గనకనే - నోళ్ల ననరాదు
అదిగాక సభలోన - ఆకౌరవులకు
మానభంగము గల్గు - హీనకాలమున
మానధన మొసగిన - మాహాత్మ్యశాలి
అటువంటి శ్రీకృష్ణు - కనుగు చెల్లెలట
అని మరి తలపోసి - అతివ మోదించె
కేళికాగృహములో - క్రీడియు నపుడు
పరిహాసముగ ననియె - పణతితో నగుచు
నాడు చెయి బట్టిన - నాతిరో నీవు
విడిపించి లోపలికి - వేగ బోయితివి
యిపు డెందు బోయెదే - యిభరాజగమన
కనుక సంతోషమ్ము - గానుండ తగును
ఓడక వచ్చి నా - యొద్ద గూర్చుండు
మన మరి సిగ్గున - వనిత సుభద్ర
మగువ తా దివ్వెల - మాటుకే చనెను
కొనలు నిక్కగ వేయు - కుసుమాస్త్రములన
కొమలు నిక్కగ వల - పుల చూపుచూచె

అల మోహనాంగుడు - న్నటుల జూచి చెలిని
లజ్జించి దిగ్గన - రమణి శోషించె
బిబ్బరితనమున - నెలత చెయివట్టి
అబ్బురమ్మున కౌగి - టదుముకొని తెచ్చి
తొయ్యలిని తొడలపై - నెయ్యమున నునిచి
పొన్నపువ్వులదండ - పొలతికి జుట్టి
కుంకుమగంధమ్ము - కోమలి కలది
బంగారు సురటి చే - పట్టి కిరీటి
అంగనకు విసిరె - నతిముదమ్మునను
ప్రాణేశు పాదములు - పణతి తగ నొత్తి
యెల్ల లోకమ్ములు - నేలిన యట్టి
వల్లభుతోడని - వనిత పుట్టితివి
నీపాదములసేవ - నే జేయవలెను
మాపాదముల నొత్త - మగువ నీకేల
మంతటి వాడైన - యా గజేంద్రుండు
మావటీనికి క్రింద - మణిగుండ లేద
పురుషోత్తములతోన - పుట్టితివి గనుక
బుద్ధులకు కొదవటే - పొలతిరో నీకు
అనుచు తేనియబోలు - సతివచ లాని
పానకంబులు త్రాగి - వం స్లారగించి
కర్పూర వీడెములు - కడు నర్థి జేసె

ఈను తేను లుప్పొంగె - ఆదంపతులకు
తలంపులు పులకించె - నెలతకుంబటికి
ఆసుభద్రాదేవి - ఆయర్జునుండు
సంతోషమున నుండ్రి - సర్వకాలమ్ము
అవనిలో తాళ్లపా - కాన్నయ్యగారి
తరుణి తిమ్మక చెప్పె - దాను సుభద్ర
కల్యాణ మను పాట - కడుమంచి తేట
పలుకుల ; నీపాట - పాడినా విన్న
శ్రీహరి వారికి - చేరువై యుండు
నానాట పాపములు - నాశనం బౌను
ఆప్తులు బంధువు - లను పొందగలరు
సత్పు సంతానములు - సమకూర గలవు.

సంపూర్ణము.

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రెస్, తిరుపతి—కా. 250 11-3-5(